కథ

గన్నవరపు నరసింహమూర్తి

# ఉడుతాభక్తి

విశాఖపట్నం విమానాశ్రయంలో విమానం దిగగానే ఒకింత ఉద్విగ్నతకి లోనయ్యాను నేను. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని నేను వదలి అప్పుడే పది సంవత్సరాలవుతోంది. ఇంజనీరింగ్ పూర్తవగానే ఉద్యోగనిమిత్తం అమెరికా వచ్చేశాను. అప్పట్లో సాఫ్ట్‌వేర్ మంచి ఊపు మీద వుండడంతో పెద్ద పెద్ద సంస్థల్లో ఉద్యోగాలొచ్చేవి. మూడేళ్లు అలా పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు చేసి ఆ తర్వాత నేనే స్వయంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించాను. అది మూడేళ్లలో మంచి ఫలితాల్నిచ్చింది. ఇప్పుడు తను బాగా సంపాదిస్తున్నాడు. ఈరోజు తన సంస్థలో సుమారు రెండు వందల మంది పనిచేస్తున్నారు. అక్కడే నేను ఒక ఇల్లు కూడా కొనుక్కున్నాను.

కానీ ఇన్నాళ్లూ నన్ను బాధిస్తున్న అంశం మాత్రం మా ఊరు వచ్చి అమ్మానాన్నల్ని చూడాలన్నది, వాళ్లని చూడాలన్న కోరిక బలంగా ఉన్నా ఈ వ్యాపారంలో పడి రాలేకపోయాను. ఎన్నోసార్లు తనను చూడాలనీ అమ్మానాన్నలు ఉత్తరాలు రాస్తుండేవారు. తనే కుదరక రాలేకపోయాడు.


కానీ ఈమధ్యనే మా నాన్న ఈ పొలాల వ్యవహారాలు తను చూడలేనని, వెంటనే వచ్చి వాటిని అమ్మివేస్తే మంచిదని చెబితే తప్పక ఇప్పుడు బయలుదేరేను.

మా ఊళ్లో మాకు ఏభై ఎకరాల పొలం వుంది. మాది చాలా అందమైన పల్లె. అందమైన ఏరు, పచ్చని పొలాలతో అందంగా వుండేది. అలా అనీ ఇప్పుడు నేను ఆ ఊళ్లో వుండలేను. ఆనందకరమైన, విలాసవంతమైన అమెరికా జీవితానికి అలవాటు పడ్డ నేను ఇక్కడకు తిరిగి రావడం కుదిరే పనికాదు. అందుకే ఆ పొలాల్ని అమ్మేసి అమ్మానాన్నల్ని నాతో తీసుకుపోదామనీ వచ్చాను.

ట్యాక్సీ ఈలోగా మా ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించడంతో నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఇప్పుడు మా ఊరికి తారు రోడ్డు వేసినట్టున్నారు.

ఎందుకో మా ఊరి పరిసరాలు చూస్తుంటే నాకు కొత్తగా కనిపిస్తున్నాయి. భావోద్రేకం కలుగుతోంది. చిన్నప్పుడు తనిక్కడే పెరిగాడు. ఇక్కడే చదివాడు. ఈ ఏటి ఒడ్డునే ఎన్నో ఆటలు ఆడేవాణ్ణి. ఈ ఊరితో నా అనుబంధం ఇరవై ఏళ్లు.

ఒకసారి ఆ పొలాలు అమ్మేసి అమెరికా వెళ్లిపోతే



# కామ్నాకి మంచిరోజులు

కామ్నా జెత్మలానీకి ఇప్పుడు మంచి రోజులు వస్తున్నట్టే వుంది. అమధ్య కొంత గ్యాప్ వచ్చాక ఇప్పుడామె 'అందమైన అబద్ధం', 'మెంటల్ కృష్ణ' లాంటి సినిమాలతో పాటు మరో పేరు నిర్ణయించని రెండు సినిమాలు చేస్తోంది. వీటితోపాటు మరికొన్ని చాన్సులు కూడా ఆమె ముంగిట నిలిచి వున్నాయిట. వీటిలో ఏ ఒక్కటీ హిట్టయినా చాలు, ఆమె కెరీర్ ఝామ్మంటూ ఊపందుకుంటుంది. అందుకనే కామ్మ ఇప్పుడు ఎంతో సంతోషంగా వుంది. కాదా మరి!

శాశ్వతంగా మా ఊరికి దూరమైనట్టే. ఆ ఆలోచన రాగానే నాకు చాలా బాధ వేసింది. కారు ఏటి ఒడ్డు పక్క నుంచి వెళుతోంది. ఆ పరిసరాలన్నీ పచ్చని చేలతో సుందరంగా ఉన్నాయి. తన చిన్నప్పుడు ఇవన్నీ బీడు భూములు. ఏటికి తన ఊరు ఎత్తు ప్రాంతంలో వుండడం వల్ల ఏటిలో నీరు సమృద్ధిగా ఉన్నా మా పొలాలకు చుక్కనీరు కూడా వచ్చేది కాదు. ఎప్పుడూ వ్యవసాయానికి వర్షాల మీద ఆధారపడే వాళ్లు తన ఊరివాళ్లంతా. కానీ ఇప్పుడు ఆ ప్రాంతమంతా కనుచూపుమేర హరిత వర్ణపు తివాచీ పరచినట్టు కనిపిస్తోంది. ఇంత పచ్చదనం ఎలా వచ్చిందో నాకైతే అంతు పట్టడం లేదు.

టాక్సీ ఊళ్లోకి ప్రవేశిస్తుంటే నాకు చిన్ననాటి స్నేహితుడు రామం గుర్తుకొచ్చాడు. వాడు నేను కలిసి ఇంటర్ వరకు చదువుకున్నాం. రామం చాలా తెలివైనవాడు కావడంతో వాడికి ఐఐటీలో సీటొచ్చింది. కానీ వాళ్ల నాన్న చిన్న రైతు కావడం వల్ల చదివించడం ఇబ్బందవుతుందేమోనని సంశయించినా అందరూ పోరుపెట్టడంతో చివరకు జాయిన్ అవడం తనకింకా గుర్తుంది.



తను వేరే ఇంజనీరింగ్ కాలేజీలో జాయినయ్యాడు. ఆ తర్వాత వాడు నేను మరి కలవలేదు. ఇప్పుడు బహుశా వాడు కూడా ఐఐటీలో చదువు పూర్తి చేసి ఏ స్టేట్స్‌కో వెళ్లిపోయి వుంటాడు. అయినా తన పిచ్చిగానీ అంత చదువూ చదుకునీ ఇక్కడెందుకుంటాడు? తన ఆలోచన తనకే నవ్వొచ్చింది. అయినా చదువుకున్న వాళ్లు ఈ కాలంలో పల్లెల్లో వుండగలరా? ఉన్నా వాళ్లు ఎదగగలరా? ఇంతలో టాక్సీ ఊళ్లోకి ప్రవేశించింది.

☆ ☆ ☆

రెండు రోజుల్లో ఇంటి వ్యవహారాలన్నీ ఓ కొలిక్కి తెచ్చాను. మా పొలాల్ని నేను అమ్మదల్చుకోలేదు. వాటిని మా రైతులకు కౌలుకిచ్చేశాను. అమ్మానాన్నలు మాత్రం అమెరికా రానన్నారు. అందుకే ఆ ఊరి పోస్టాఫీసులో వాళ్ల పేర డబ్బు డిపాజిట్ చేసేశాను. ఇంక వాళ్ల జీవితాలు ప్రశాంతంగా గడిచిపోతాయి. ఆ మర్నాడు నా చిన్ననాటి మరో స్నేహితుడు రాజు నన్ను కలవడానికి రావడంతో వాణ్ణి రామం వివరాలడిగేను. వాడు మరేమీ మాట్లాడకుండా తనతోపాటు రమ్మనడంతో ఆశ్చర్యపోయి వాణ్ణి అనుసరించాను. కొంతసేపటికి మేమిద్దరం ఏటి ఒడ్డు చేరుకున్నాం.

మా ఊరు దగ్గర ఏరు రెండు కొండల మధ్య పారుతుంటుంది. చిన్నప్పుడు మేమందరం ఆ కొండల మధ్యకు స్నానానికి వెళ్లేవాళ్లం. దూరం నుంచి చూస్తుంటే ఇప్పుడు అక్కడ ఆనకట్ట కట్టబడి వుంది. పైగా తాము నడుస్తున్నది కాలువ గట్టు మీద. దాంట్లో నీరు సమృద్ధిగా పారుతోంది. కనుచూపు మేరలో పచ్చని పొలాలు నేలతల్లికి పచ్చని చీర కట్టినట్టు కనిపిస్తున్నాయి.

ఆ ప్రాంతంలో చాలామంది కూలీలు పనిచేయడం నేను గమనించాను. అప్పుడు వాళ్ల మధ్య చూశాను రామాన్ని..ఇరవయ్యేళ్ల తర్వాత...

ఆశ్చర్యపోతూ రాజు వంక చూశాను.

"అవునురా కృష్ణా! వాడు మద్రాసు ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత అమెరికా లాంటి దేశాల్లో ఎన్ని పెద్ద ఉద్యోగాలొచ్చినా వాటినన్నింటినీ కాదని ఇక్కడే మన ఊళ్లోనే ఉండిపోయాడు"

"కారణం" అర్థం కాక అడిగేను.

"ఇప్పుడు మనం వాడి దగ్గరికే వెళ్తున్నాం. వాడినే అడుగుదుగానీ పద" అంటూ రామం దగ్గరకు నన్ను తీసుకెళ్లాడు రాజు.

కూలీ వాళ్లకు ఏదో చెబుతున్న రామం తనను చూడగానే వడివడిగా వచ్చి ఆప్యాయంగా కావలించుకున్నాడు.

పది నిమిషాల తర్వాత మేము ముగ్గురం దూరంగా పారుతున్న కాలువ గట్టు మీద కూర్చుని మాట్లాడుకుంటున్నాం.

"ఏరా రామం? నువ్వేంటి ఐఐటీలో చదివి ఇక్కడ ఉండిపోవడం ఏమిటి? నాకేమీ అర్థం కావట్లేదు" ఆశ్చర్యంతో అడిగాను వాడ్ని.

వాడు కొంచెంసేపు మౌనంగా వుండి అప్పుడు చెప్పడం మొదలుపెట్టాడు. "ఇందులో అర్థం కావడానికేముందిరా? ఐఐటీలో చదివినంత మాత్రాన అమెరికా వెళ్లిపోవాలా? ఏం మనదేశానికి మన ఊరికి సేవ చెయ్యకూడదా?"

"అది కాదురా రామం! మన దేశంలో ఉన్న ఈ అవినీతి రాజకీయాలు, లంచగొండితనం, పేదరికాల వల్ల ఈ దేశాన్ని గానీ, ఈ పల్లెల్ని గానీ మనలాంటి సామాన్యులు మార్చగలడం సాధ్యమేనా నీ పిచ్చిగానీ" నాది సూటిప్రశ్న.

"అలా అందరూ అనుకుని ఎవరి స్వార్థం వాళ్లు చూసుకుంటే ఇక మనవాళ్లనీ మన ఊళ్లనీ కాపాడేదెవర్రా? మనం ఈ అందమైన ఊళ్లో పుట్టాం. మనకు ఈ పల్లె తల్లిలాంటిది. అలాంటిది మనలాంటి వాళ్లంతా మన సుఖాల కోసం ఎక్కడికో ఇతర దేశాలకు వెళ్లిపోతే ఈ అందమైన పల్లెలు బోసిపోవా? మనని పెంచి పెద్ద చేసిన ఈ పల్లెలకు మనం ఏమీ చెయ్యొద్దా చెప్పు?" రామం ముఖంలో కాసింత ఆవేశం కనిపించింది నాకు.


"అంటే నీ ఉద్దేశం ఇక్కడే వీళ్లతోనే వుండిపోయి వీళ్లతో పాటు మట్టిపిసికి వ్యవసాయం చేస్తూ ఇక్కడే జీవితాన్ని గడిపెయ్యాలంటావా? ఆపాటిదానికి ఈ బిటెక్‌లు అందులోనూ ఐఐటీల్లోనూ చదువులెందుకురా? ఈ పనులు చెయ్యడానికి ఏ చదువులూ అక్క

ర్లేదు" నా ఉద్దేశాన్ని సూటిగానే చెప్పాను. ఎందుకో వాడు చేసిన పని నాకు నచ్చలేదు.

"కృష్ణా! నీకు తెలుసు కదరా చిన్నప్పుడు మన ఊరి పక్కనుంచే ఇంత పెద్ద ఏరు పారుతున్నా మన పొలాలకు కడివెడు నీటిచుక్క వచ్చేదికాదు. ఎప్పుడూ పొలాలు నీరులేక ఎండిపోయి ఒక్క పంటైనా చేతికొచ్చేదా? తినడానికి ఇంత గంజైనా లేక మన రైతన్నలు అల్లాడిపోవడం మనం చూళ్లేదురా? ఈ సమయాల్లో మన ప్రాంతం నుంచి గోదావరి ప్రాంతాలకు ఎంత మంది కూలిపనులకోసం వలస పోయే వారో నీకు తెలియదురా? ఏదో మీలాంటి సంపన్నులు బోరింగ్‌లు తవ్వుకుని వ్యవసాయం చేసుకునేవారు కానీ మిగతా వాళ్ల సంగతేమిటి? ఈ పేదరికం వల్లే నాకు ఐఐటీలో సీటు వచ్చినా స్తోమత లేక మా నాన్న ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. తనకున్న ఐదెకరాల్లో రెండెకరాలు మీ నాన్నగారికి అమ్మవలసి వచ్చింది. నాలాగే ఇక్కడ పేద వాళ్లందరూ...వీళ్లందరికీ ఈ వ్యవసాయమే దిక్కు. అదే వాళ్లకి తిండిపెట్టే పరిశ్రమ. అది వర్షాధారం కావడంతో వీళ్ల జీవితాలు ఎప్పుడూ ఒడుదుడుకుల్లో సాగేది. ఇదీ నేను చిన్నప్పట్నించీ చూస్తున్న నా పల్లె బతుకు..."

అతను ఆవేశంగా చెబుతుంటే నేను ఆశ్చర్యంగా వింటున్నాను. అతను ఇంకా చెబుతూనే వున్నాడు.

"అందుకేరా నేను బిటెక్ పూర్తయిన తర్వాత నా ఊరికి ఏదో చెయ్యాలనిపించింది. మన ఏరు పారుతున్న రెండు కొండల మధ్య ఒక ఆనకట్ట కట్టి కాలువ తవ్వితే మన ఊరితో పాటు ఎత్తులో వున్న మరో ఇరవై ఊళ్లకు నీళ్లందుతాయి. ఆనకట్ట ఎత్తు ఆరు మీటర్ల వరకు కడితే ఎగువన వున్న ఏ ఊరూ మునిగిపోదు. ఆ విధంగా ఒక ప్రాజెక్టుకు రూపకల్పన చేసి ఆ రిపోర్టుతో ఈ జిల్లా కలెక్టర్‌ని కలవడం జరిగింది. అతను ప్రాజెక్టు ఆశయం బాగున్నా కట్టడానికి నిధులు అడ్డంకి అని అన్నాడు. అప్పుడు కాలువని మా ఇరవై ఊళ్ల ప్రజలు స్వచ్ఛందంగా తవ్వుకునేందుకు ముందుకు రావడంతో అతను సరేనని ఆ ప్రతిపాదనని ప్రభుత్వ మంజూరు కోసం పంపించాడు. ఆ తర్వాత ఈ ప్రాంత ఎమ్మెల్యేని కలిసి ఈ ప్రాజెక్టుని శాంక్షన్ చేయించమనీ విన్నవించుకున్నాం. అది కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఈ ఇరవై ఊళ్ల వాళ్లు ప్రతిపక్షానికి ఓట్లు వేస్తామనీ బెదిరించడంతో అతను కూడా ముఖ్యమంత్రిని కలిసి ఈ ప్రాజెక్టుని శాంక్షన్ చేయించాడు. ఇది మూడేళ్ల క్రితం ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రధానమైన ఆనకట్ట రెండు కొండల మధ్య కడితే మన ఊరి రైతులతో సహా ఈ ఇరవై ఊళ్ల వాళ్లు వాళ్ల వాళ్ల ఊళ్ల దగ్గర కాలువని తవ్వుకోవడంతో క్రితం సంవత్సరమే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయి అన్ని ఊళ్లకు సమృద్ధిగా నీరు అందుతోంది. ఇప్పుడు అన్ని ఊళ్లలో బీడు పొలాల్లో కూడా రెండేసి పంటలు పండుతున్నాయి. పేద ప్రజలు ఇప్పుడు నోటి నిండా పట్టెడన్నం తింటున్నారు" రామం చెప్పుకుపోతున్నాడు. వింటున్న నా కళ్లల్లో సన్నని తడి.




"నిజానికి ఐఐటీలో నా చదువు పూర్తవగానే నాకు అమెరికాలో నెలకు ఐదు లక్షల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం వచ్చింది. దానికోసం నేను అమెరికా వెళితే వ్యక్తిగతంగా నేను బాగుపడేవాణ్ణి. మహా అయితే నా కుటుంబం లాభపడేది. కానీ ఈ పని వల్ల మన ఊరితో పాటు ఇరవై ఊళ్లు బాగుపడ్డాయి. ఇంక ఈ రైతుల జీవితాలకు ఢోకా లేదు...నిజానికి ఈ ఊరికిగానీ, ఈ ప్రజలకు గానీ నేను చేసిందేమీ పెద్దగా లేదు. ఏదో ఉడుతాభక్తిగా చిన్న ప్రయత్నం చేశాను. అసలు కష్టపడింది ఇక్కడి పేద రైతులే. వాళ్లే ఈ కాలువ తవ్వుకున్నారు. ఈ ప్రాజెక్టు వల్లే ఈ ఊరికి రోడ్డు, బస్సు వచ్చాయి. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా వుంది. ఇంతటి తృప్తి కొన్ని వేల కోట్లు గడించినా రాదేమో?"

రామం అలా చెప్పుకుపోతున్నాడు. నేను శ్రోతనే అయ్యాను. అప్పుడే నాలో కొన్ని ఆలోచనలు రూపుదిద్దుకోసాగాయి.

ఇంటికి వెళ్లిన తర్వాత నాలో అంతర్మథనం మొదలైంది. నేను అమెరికా వెళ్లి ఇంతటి డబ్బు సంపాదించి సాధించిందేమిటి? దీనివల్ల ఏమిటి ప్రయోజనం? అందుకే నా వంతు ప్రయత్నంగా నా ఊరుకి తద్వారా నా ఊరి ప్రజలకు ఏదైనా చెయ్యాలని అనిపించింది. అమెరికా వెళ్లిన తర్వాత ఆ దిశగా ప్రయత్నం ప్రారంభించాలన్న నిర్ణయానికి వచ్చాను.

☆



## ఆరు భాషలొచ్చు

స్వతహాగా కేరళ కుట్టి అయిన సింధు మీనన్‌కి ఆరు భాషల్లో మంచి ప్రావీణ్యం వుందిట. తన మాతృభాష మలయాళం కాకుండా తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఇంగ్లీషు భాషలు అనర్గళంగా మాట్లాడగలుగుతోంది ఈ 'చందమామ' ఫేమ్ సింధు. ఇటీవలే ఆమె నటించిన 'రెయిన్‌బో' రిలీజైంది. తనకి తెలుగు, తమిళంలో నటించడం అంటే భలే ఇష్టంట. బాగానే వుంది, అవకాశాల మాటో!